క్లుప్తంగా

అజోలాతో ప్రయోజనాలు



పొలంలో అజోలా వేస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: వరిలో అజోలా వేయ డిజ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రచారకులు మెట్ట ధనుంజయ అన్నారు. జరజాం పంచాయతీ గొలివి వానిపేటలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో గురువారం అజోలా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజోలా వల్ల నత్రజని పంటకు అంది కలుపు నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సూత్రాలు పాటిస్తే రసాయన ఎరువులు, పురుగుల మందులు, కలుపు మందుల ఖర్చు పూర్తిగా తగ్గించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీదేవి, పూర్ణ, హరేరామ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గార: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత అవసరమని సాందీపని విద్యాలయ కరస్పాండెంట్ అంబటి చక్రధరరావు అన్నారు. గురువారం పాఠశాలలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ నిర్వహించిన విష్ణు సహస్రనామ స్తోత్ర శ్లోక కంఠస్త పోటీల్లో పాఠశాలకు చెందిన బి.రోహిత్‌కు ద్వితీయ, కె.అసిరిరాజుకు తృతీయ స్థానం, అచ్యుతాష్టకం పఠన పోటీల్లో జి.హర్షితకు ప్రథమ, యు.సరితకు ద్వితీయస్థానం లభించింది. వీరికి ప్రత్యేక బహుమతులు అందించడంతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.పురుషోత్తమరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జాడలో గడప గడపకు మన ప్రభుత్వం

జి.సిగడాం: జాడ గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మీసాల సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



స్టడీ మెటీరియల్‌తో విజేతలు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లు తులసీరావు, ఆర్మీ జవాన్లు కలిసి 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బోర పూజిత, చల్ల అనురాధ, సాధు పద్మలకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎల్.అమ్మాజీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధగా చదివితే ఎక్కువ మార్కులు సాధించగలరని చెప్పారు. ఆర్మీ జవాన్లు గంగు ప్రసాద్, నగేష్, రాజు, ధనుంజయ, గొండు ధనుంజయ, సచివాలయ కార్యదర్శి ఎం.భాస్కరరావు పాల్గొన్నారు.

ఆదిత్యున్ని దర్శించుకున్న మెప్మా డైరెక్టర్



విజయలక్ష్మికి జ్ఞాపికను అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర మెప్మా డైరెక్టర్ వి.విజయలక్ష్మి గురువారం దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, జిల్లా టూరిజం అధికారి ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో సోషల్ ఆడిట్ గ్రామసభలు



పెదలింగాలవలసలో వివరాలు వెల్లడిస్తున్న ఆడిట్ డీఆర్‌పీ

లావేరు: పెదలింగాలవలస, తాళ్లవలస, అప్పాపురం, పోతయ్యవలస, గోవిందపురం, బుడతవలస పంచాయతీల్లో గురువారం సోషల్ ఆడిట్ గ్రామసభలు నిర్వహించారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు ఇటీవల ఆడిట్ నిర్వహించారు. ఆ వివరాలను తెలియజేసేందుకు గురువారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సిరులు..!

- సత్ఫలితాలనిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం
- రాగోలు పంచాయతీలో స్ఫూర్తిగా నిలుస్తున్న క్లాప్‌మిత్రలు
- వర్మీకంపోస్టు ఎరువులు, కూరగాయల విక్రయంతో లబ్ధి

శ్రీకాకుళం రూరల్:

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు సత్ఫలితాలనిస్తున్నాయి. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు పంచాయతీలో ఇంటింటా సేకరిస్తున్న తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా ఈ కేంద్రానికి తీసుకువచ్చి వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నారు. దీనికి తోడు కేంద్రం పరిసరాల్లో కూరగాయలు సైతం పండిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు.

గ్రామస్తులకు అవగాహన..

గతంలో పంచాయతీలో ఎక్కడపడితే అక్కడ చెత్త పారబోసేవారు. దీంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యేవి. ప్రజలు సైతం రోగాల బారినపడేవారు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరించాలని నిర్ణయించింది. ఇందు కోసం క్లాప్‌మిత్రలను నియమించింది. రాగోలు పంచాయతీలో 8 మంది క్లాప్‌మిత్రలు ప్రతిరోజూ బండి ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం'కు తరలిస్తున్నారు. ఈ ప్రక్రియను పంచాయతీ కార్యదర్శి తిరుమలదేవి నిత్యం పర్యవేక్షిస్తూ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూస్తున్నారు.

ఎరువులు, కూరగాయలు..

ముందుగా సేకరించిన చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి వాటిని తండేవలసలోని రీసైక్లింగ్ యూనిట్‌కు తరలిస్తున్నారు. మిగిలిన పాడైపోయిన కూరగాయలు, తడిచెత్తను మూడు నెలల పాటు వర్మీబిట్స్‌లో పూర్తిగా నానబెడతారు. తర్వాత దశలో వానపాములను ప్రవేశపెట్టాక రెండు నెలల తర్వాత ఎరువులు తయారవుతాయి. కేజీ ఎరువులను రూ.7కు విక్రయిస్తున్నారు. వీటితో పాటు పరిసర ప్రాంతాల్లో తోటకూర, పాలకూర, కొత్తిమీర, గోంగూర, మెంతుకూర, అరటిచెట్లు, బొప్పాయి తదితర పంటను విరివిరిగా పండిస్తున్నారు.



వర్మీకంపోస్టును తయారు చేస్తున్న దృశ్యం



ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తూ..



పాడైపోయిన కూరగాయలను నానబెడుతూ..

వర్మీకంపోస్టు సిద్ధం..



పంచాయితీలో సుమారు ఏడు వేల మంది జనాభా నివసిస్తున్నారు. దీంతో భారీ ఎత్తున చెత్త పోగుపడుతుంది. క్లాప్‌మిత్రల ద్వారా 8 బండ్లతో తడిచెత్తను పొడి చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నాం. ఇంతవరకూ రెండు క్వింటాళ్ల మేర వర్మీ కంపోస్టును తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచాం.
– గేదెల చెంగల్వరావు, రాగోలు పంచాయతీ సర్పంచ్

26న సైన్స్ ప్రతిభా పరీక్ష



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

రణస్థలం: ఈ నెల 28న సైన్స్ డే సందర్భంగా మై డ్రీమ్ అకాడమీ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ అల్లాడ త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు గురువారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ నాజాన కళా వెంకటరావు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ సాయి జూనియర్ కళాశాలలో జరిగే ఈ పరీక్షకు రణస్థలం మండలంలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జీవ, భౌతిక, రసాయన శాస్త్రం సబ్జెక్టులపై పరీక్ష ఉంటుందని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 83280 13236 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీఎఫ్ స్టడీ సర్కిల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందుకున్న వారితో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు పంచాయతీ పరిధిలో ఇటీవల నియమితులైన అంగన్‌వాడీ హెల్పర్లకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా పెదపాడు క్యాంపు కార్యాలయంలో గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధామాధవి, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, రాగోలు సర్పంచ్ గేదెల చెంగల్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదికి సన్మానం



వినయ్‌భూషణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఇటీవల ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించిన మీగడ వినయ్‌భూషణ్‌కు జంగమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు విభూది సూరిబాబు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. శ్రీకాకుళంలోని సంఘ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వినయ్‌భూషణ్ ప్రభుత్వ న్యాయవాదిగా రెండోసారి బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.భీమారావు, వి.వెంకటేశ్వరరావు, రమేష్, లోకనాథం, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మనాథాలయ అనుబంధ ఆలయమైన పాతాళ సిద్ధేశ్వర ఆలయంలో శివ పార్వతుల కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు పెంట జగన్నాథశర్మ, అర్చకులు ఇప్పిలి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకూర్మనాథాలయ ఈఓ గుత్తు గురునాథరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అదనపు 'ఉపాధి' కల్పించేందుకు చర్యలు



వాండ్రంగిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

- కేంద్ర బృందం సభ్యులు గిరిజా విజయ్ శంకర్ పాడి, సత్యరాజ్ రౌతు
- జి.సిగడాంలో పర్యటన

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల పనిదినాలు పూర్తిగా చేసినవారికి అదనపు మరో 50 రోజుల పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని కేంద్ర బృందం సభ్యులు గిరిజా విజయ్‌శంకర్ పాడి, సత్యరాజ్ రౌతు తెలిపారు. గురువారం జి.సిగడాం మండలం వాండ్రంగి గ్రామంలో పర్యటించారు.

ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ, గ్రావెల్ రోడ్లు, అంగన్‌వాడీ, పంచా యతీ భవనాలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, ఇందిరా ఆవాస్ యోజన గృహాల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వయంశక్తి సంఘాల పనితీరుపై ఆరా తీశారు. అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిబాబు, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరమణ, డీపీఓ రవికుమార్, డీపీఆర్‌సీ రాజు, ఏపీడీ శైలజ, డీఎల్‌పీఓలు నిశ్చల, ప్రకాశరావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈఈ సీతంనాయుడు, ఏఈఈ కూర్మారావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'కరెన్సీ నోటుపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి'



నినదిస్తున్న ప్రజా సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోటుపై ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురాం, రాష్ట్ర అధ్యక్షుడు కంఠ వేణు కోరారు. కరెన్సీపై ఫొటో ముద్రించాలని కోరుతూ దేశ వ్యాప్త ప్రజా పోరుయాత్ర ఉద్యమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ ఆడిటోరియం, ఆర్ట్స్ కళాశాలల్లో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ, కాళింగ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పొట్నూరు సూర్యం, ఏఐడీఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి యజ్జల గురుమూర్తి, మహిళా కన్వీనర్ సీర రాజేశ్వరి, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.రామప్పడు, జిల్లా నాయకులు లాన సోమేశ్వరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఆర్జి కోటి, రిటైర్డ్ డీఈఎల్ అనంతరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో హయాతినగరం విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన బాలికలతో ప్రిన్సిపాల్, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయతినగరంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు విజయవాడ వేదికగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో సత్తాచాటారు. 8వ తరగతికి చెందిన వి.వైష్ణవి (షటిల్ బాడ్మింటన్‌లో ప్రథమ), కె.లక్ష్మిశ్రీ (కబడ్డీ, ఖోఖోల్లో ప్రథమ), 9వ తరగతికి చెందిన పి.లక్ష్మీకవిత మార్షల్ ఆర్ట్స్‌లో, 8వ తరగతికి చెందిన పి.అంజలి (1000 నగదు బహుమతి)ని సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి చెప్పారు. వీరిని గురువారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చిపేటలో మహాన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బుచ్చిపేటలో భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని గురువారం మహాన్నదానం నిర్వహించారు. రామ మందిరంలో 12 గంటల పాటు ఏకధాటిగా నిర్వహించిన భజన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మనమంతా జగనన్న సైనికులం

- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే కిరణ్



లావేరు: బెజ్జిపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు/జి.సిగడాం: మనమంతా జగనన్న సైనికులమని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయఢంకా మోగించేలా సచివాలయాల కన్వీనర్లు, జగనన్న గృహసారథులు సమష్టిగా కృషి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. లావేరు మండలంలోని 13 సచివాయాల కన్వీనర్లు, జగనన్న గృహ సారథులకు గురువారం బెజ్జిపురంలో శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కన్వీనర్లకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి వలంటీరుకు ఇద్దరు జగనన్న గృహసారథులను నియమించినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను అనుగుణంగా అందరూ పనిచేయాలన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, ఏపీ అర్బన్ ఫైనాన్సు కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, సచివాలయాల, గృహసారథుల మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు లుకలాపు శ్రీనివాసరావు, అలుపున రమణమ్మ, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మాడుగుల మురళీధర్‌బాబా, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



జి.సిగడాం: బాతువలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయం..

వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగిరేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. జి.సిగడాం మండలం బాతువలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. టీడీపీ నేతల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, సచివాలయం, గృహసారథుల కన్వీనర్ డోల వెంకటరమణ, బూరాడ వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, మామిడి బలరాం, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, సర్పంచులు కంది రమాదేవి, కుమరాపు శ్రీనివాసరావు, చందక సతీష్, తొత్తడి రామారావు, భూపతి సురేష్‌కుమార్, మావిడి శ్రీనివాసరావు, బాణాన సూర్యనారాయణ, బాలి రమేష్, ఎంపీటీసీ సభ్యులు బూటు అప్పారావు, కుమరాపు రమేష్‌నాయుడు, పెద్ది శ్రీనివాసరావు, నాయకులు కలిశెట్టి శాంతారావు, నారాయణరావు, కోటీశ్వరరావు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు

'యువ' టూరిజం క్లబ్ ద్వారా పర్యాటక అభివృద్ధి



విద్యా ఉద్యోగ దీపికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: 'యువ' టూరిజం క్లబ్ ద్వారా పర్యాటక అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా టూరిజం అధికారి నారాయణరావు అన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'యువ టూరిజం' క్లబ్‌లో భాగంగా గురువారం జిల్లాలో తొలి క్లబ్ ఏర్పాటుకు ముందడుగు పడింది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్)కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు ఆధ్వర్యంలో విద్యార్థినులతో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయడమే క్లబ్ ఉద్దేశమని చెప్పారు. సభ్యులుగా చేరిన యువతకు పర్యాటక ప్రదేశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో టూరిజం గైడ్స్‌గా ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త యార్లగడ్డ గీతా శ్రీకాంత్, డీపీఆర్‌ఓ బాలమస్ సింగ్, చరిత్ర విభాగాధిపతి కృష్ణారావు, టూరిజం అధికారి వరలక్ష్మి, గీత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్ బకాయిలపై దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు

రణస్థలం: పంచాయతీల పరిధిలో గ్రంథాలయ సెస్ బకాయిలను వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు సిబ్బందికి సూచించారు. రణస్థలం శాఖా గ్రంథాలయాన్ని గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి నుంచి వసూలు చేస్తున్న పన్నులో 8శాతం సెస్ గ్రంథాలయానికి చెల్లించాల్సి ఉందన్నారు. సెస్ బకాయిలు వస్తేనే గ్రంథాలయ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కొత్త పుస్తకాలు కొనడం, మరుగుదొడ్లు నిర్మించడం వంటి పనులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవి, గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. నిద్దాలమ్మా!



నిద్దాలమ్మ తల్లి

నిద్దాం గ్రామంలో నిద్దాలమ్మ తల్లి 16వ యాత్రా మహోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. మహిళలంతా ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– జి.సిగడాం



ముర్రాటలతో బారులు తీరిన మహిళలు